# ‘ప్రజాపాలన’లో దరఖాస్తుల కొరత



సంగారెడ్డి పట్టణంలో ఆధార్ అనుసంధానానికి బారులు తీరిన ప్రజలు

జహీరాబాద్, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలనలో ప్రజలకు అవసరమైన దరఖాస్తులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కౌంటర్‌లో మున్సిపల్ పరిధిలో ఉన్న 6 వార్డుకు 300 దరఖాస్తులు అవసరం ఉండగా, అధికారులు వంద దరఖాస్తులు ఇచ్చారని సిబ్బంది తెలిపారు. కొందరు ప్రజాపాలన దరఖాస్తుల కోసం సంగారెడ్డి, హైదరాబాద్ నుంచి జహీరాబాద్‌కు వచ్చారు. దరఖాస్తు పత్రాలు అధికారులు ఇవ్వకపోవడంతో వారు సాయంత్రం వరకు కౌంటర్ వద్ద వేచి ఉన్నారు.

### ఆధార్ అనుసంధానానికి బారులు

సంగారెడ్డి, డిసెంబర్ 29 : ఆధార్ కార్డులలో చిన్నపిల్లల నమోదు, అనుసంధానానికి ప్రజలు మీ సేవ, బ్యాంకు కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరారు. చలిని లెక్కపెట్టకుండా ఉదయం ఐదు గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని పోస్టాఫీస్, ఆధార నమోదు బ్యాంకు కేంద్రాల దగ్గర బారులు తీరారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్ కార్డ్ ప్రమాణికం కావడంతో ఆయా కేంద్రాలకు భారీగా తరలివచ్చారు.

### ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

కంది/అమీన్‌పూర్, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంది మండల తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. మామిడిపల్లి, కౌలంపేట, చిద్రుప్ప, బేగంపేట గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణినగర్, సుజాత హోమ్స్ కమ్యూనిటీ హాల్, హెచ్‌ఎంటీ కమ్యూనిటీ హాల్, పీజేఆర్ పార్క్ రోడ్ నం.12 వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

### రెండో రోజు నాలుగు వార్డుల్లో

బొల్లారం/జిన్నారం,డిసెంబర్ 29 : రెండో రోజు ప్రజా పాలన బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 13, 14, 20, 21 వార్డుల్లో కొనసాగింది. కౌంటర్ల వద్ద దరఖాస్తుల ప్రక్రియను మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి, కమిషనర్ సంగారెడ్డి ప్రారంభించారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, శివనగర్ గ్రామాల్లో అధికారులు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు.

### ప్రజా పాలనకు 922 దరఖాస్తులు

కొండాపూర్/గుమ్మడిదల,డిసెంబర్ 29 : కొండాపూర్, అలీయాబాద్, మునిదేవనిపల్లి గ్రామల్లో నిర్వహించిన ప్రజా పాలకు 922 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో మధులత తెలిపారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లిలో ప్రారంభమైన ప్రజాపాలనను ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు ప్రారంభించారు.

**వట్‌పల్లిలో :** వట్‌పల్లి/కోహీర్, డిసెంబర్ 29 : వట్‌పల్లిమండలంలోని పల్వట్ల, షాద్‌నగర్ గ్రామాల్లో ఎంపీడీవో జగదీశ్వర్, ఎమ్మార్వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ పథకాలను పొందేందుకు అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని కోహీర్ జడ్పీటీసీ రాందాస్ కోరారు. దిగ్వాల్, కవేలి, బిలాల్‌పూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను ప్రారంభించారు.

## దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేయాలి

**సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ శరత్**

నారాయణఖేడ్, డిసెంబర్ 29: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. నారాయణఖేడ్ మండలం రుద్రారంలో ప్రజాపాలన గ్రామసభకు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆర్డీవో వెంకటేశ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, ఎంపీపీ అధ్యక్షురాలు చాందిబాయి చౌహాన్, సర్పంచ్ సువర్ణ ప్రభాకర్ ఉన్నారు.



నారాయణఖేడ్ : రుద్రారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

## ఘనంగా ఉర్సు ప్రారంభం



కోహీర్‌లోని మౌలానా మోహీజొద్దీన్ దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోహీర్, డిసెంబర్ 29 : కోహీర్ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ ఖాజా మౌలానా మోహీజొద్దీన్ తుర్కి చిస్తీ ఉర్సు శుక్రవారం ప్రారంభమైంది. 765వ ఉర్సులో భాగంగా సర్కారి గంధంతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం రాత్రి 9 గంటల నుంచి గోవా, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కళాకారులతో ఖవ్వాలీ ఉంటుందని మాజీ ఎంపీపీ, దర్గా కమిటీ అధ్యక్షుడు షౌకత్ అలీ, ఉపాధ్యక్షుడు ఎజాజ్ బండారి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి ఫరీదుద్దీన్ సేవలు మరువలేనివి

**ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు**



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 29 : మాజీ మంత్రి, ఎండీ ఫరీదుద్దీన్ చేసిన సేవలు మరువ లేనివని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎండీ ఫరీదుద్దీన్ రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎండీ తన్వీర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

జిన్నారం, డిసెంబర్ 29 : అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైన రూ.25 లక్షల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు వరంగా మారాయని తెలిపారు.



జిన్నారం: కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

### బాధితులకు నష్టపరిహారం

గతంలో భారీ వర్షాలకు ఇండ్లు కూలిన బాధితులకు మంజూరైన నష్టపరిహారం చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముప్పై మంది బాధితులకు రూ.3200 చొప్పున రూ.96వేల చెక్కులను అందజేశారు.

### బండల మల్లన్న జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పటాన్‌చెరు, డిసెంబర్ 29 : పటాన్‌చెరు డివిజన్‌లోని అల్విన్ కాలనీ బండల మల్లన్న జాతీయ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బండల మల్లన్న ఆలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. జనవరి 6,7 తేదీల్లో జాతర జరుగుతుందని తెలిపారు.

### కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

బొల్లారం, డిసెంబర్ 29 : బొల్లారం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్లు మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి తెలిపారు. జిన్నారం తహసీల్‌లో జరిగిన కార్యక్రమంలో ఒరిసే లక్ష్మీకళ, శంఖలక్ష్మి తులసి, బచ్చుగూడెం సాయిలీల, రాగుల కవిత, సంకు వసంతకు చెక్కులు అందజేశారు.

### డీసీసీబీ సేవలు మరింత విస్తరించాలి

పటాన్‌చెరు, డిసెంబర్ 29 : డీసీసీబీ సేవలు మరింత విస్తరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో రూ. 2.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న దుకాణ సముదాయం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

## మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

న్యాల్‌కల్, డిసెంబర్ 29 : చెరుకు పంట సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మండలంలోని బసంతపూర్ ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, రాష్ట్ర చెరుకు అభివృద్ధి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్డి గ్రామంలో గోదావరి గంగా చక్కెర పరిశ్రమ మాటూర్ ఆధ్వర్యంలో చెరుకు పంట సాగు విధానంలో అనుసరించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చక్కర కార్మగారం ఫిల్డ్‌మెన్ అరుణ్‌కుమార్, రైతులు రఘునాథ్, బస్వరాజ్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు

రాయికోడ్, డిసెంబర్ 29 : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు అత్యాశకు పోయి నిషేధిత గంజాయి సాగు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలు పంపుతామని ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని పీపడ్‌పల్లి, మహ్మదాపూర్, నల్లంపల్లి, రాయిపల్లి,ఇందూర్, కర్చల్, నాగన్‌పల్లి గ్రామాల ఉన్న వ్యవసాయ పొలాలను సిబ్బందితో తనిఖీలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతూ గంజాయి సాగు చేస్తే అ రైతులకు ప్రభుత్వ తరపున వచ్చే రాయితీలను నిలిపివేస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్సై ఎక్బాల్, సిబ్బంది ఉన్నారు.

## పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణపనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, డిసెంబర్ 29 : మండల పరిధిలోని మద్దికుంటలో పోచమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. పోచమ్మతల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండి ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమీనా అంజు మ్, ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఆరిఫొద్దీన్, ఎంపీటీసీ అల్లం లలిత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

గుమ్మడిదల, డిసెంబర్ 29 : ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారని ఏబీవీపీ జిల్లా సభ్యుడు మహంకాళి ఉదయ్ సాగర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళలలో బస్సులు సమయానికి రాకపోవడం వల్ల వచ్చిన బస్సుల్లో మహిళలు అధికంగా ప్రయాణించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు పడుతూ కళాశాలలకు వెళ్లకుండా ఇంటికి వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బస్సులు నడిపించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల నగర ఏబీవీపీ కార్యదర్శి జట్పుట్ సాయిరాంగౌడ్, సంయుక్త కార్యదర్శులు విజయ్, మణికంఠ, శివ, భరత్, శౌలాని తదితరులు ఉన్నారు.

## బడిబయట పిల్లలను గుర్తించిన సీఆర్‌పీ

సిర్గాపూర్, డిసెంబర్ 29 : మండల పరిధిలోని సుల్తానాబాద్ శివారు అటవీ ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద ఉన్న బడీడు పిల్లలను శుక్రవారం సీఆర్‌పీ శివకుమార్ స్వామి గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నిరుపేదలు బతుకుదెరువు కోసం ఇటుక బట్టీల్లో పని చేయాడానికి కొన్ని కుటుంబాలు వచ్చాయి. 8 మంది బడీడు చెందిన వారు కాగా, ఈనేపథ్యంలో ఒడిశాకు సంబంధించిన విద్య కోసం జిల్లా ఉన్నత విద్యాధికారులకు సమాచారమిచ్చినట్లు సీఆర్‌పీ శివకుమార్‌స్వామి తెలిపారు.



సిర్గాపూర్ : ఇటుక బట్టీల వద్ద బడీడు పిల్లలను గుర్తించిన సీఆర్‌పీ

## హత్య కేసులో తొమ్మిది మందికి జీవిత ఖైదు

సంగారెడ్డి, డిసెంబరు 29: హత్యకేసులో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిదిమందికి జీవితఖైదు విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు శుక్రవారం సంచలన తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ చెన్నూరి రూపేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. జహీరాబాద్ మండలం కాసీంపూర్ గ్రామానికి చెందిన వడ్ల నరసమ్మ(42) భర్త చనిపోవడంతో జహీరాబాద్‌లో నివాసముంటూ 25, ఏప్రిల్ 2016న సొంత గ్రామమైన కాశీంపూర్‌కు వచ్చింది. అదేరోజు గ్రామానికి చెందిన వడ్ల వీరన్న తన కూతురు వివాహం చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఆమె మైనర్ కావడంతో నరసమ్మ స్థానిక అధికారులకు సమాచారం చేరవేసిందని, అందుకే పెండ్లి ఆగిపోయిందని అనుమానపడ్డారు. ఈ విషయంలో నరసమ్మపై కోపం పెంచుకున్న వడ్ల వీరన్న కుటుంబసభ్యులందరూ అదేరోజు నరసమ్మను రాళ్లు, కర్రలతో చితకబాదారు. ఈ దాడిలో ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈమేరకు నిందితులైన వడ్ల వీరన్న(45), వడ్ల ప్రభు(45), వడ్ల ప్రశాంత్(19), వడ్ల వెంకట్(19), వడ్ల సంతోష్(19), వడ్ల రేఖ(28), వడ్ల ప్రభావతి(40), వడ్ల ఈశ్వర్(42), వడ్ల శ్రీకాంత్(19)లపై చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కేసు నమోదు చేశారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో శుక్రవారం కేసు పూర్వపరాలు పరిశీలించిన మొదటి అదనపు కోర్టు న్యాయమూర్తి సుదర్శన్ నిందితులైన తొమ్మిదిమందికి జీవిత ఖైదుతోపాటు ప్రతిఒక్కరికీ రూ.5వేల చొప్పున జరిమానా విధించారని చెప్పారు.